నిలువ నీడ కరువై.. ప్రయాణం భారమై

- బస్ షెల్టర్లు లేక ప్రయాణికులకు ఇబ్బందులు
- రోడ్లపైనే బస్సులు ఆపుతుండటంతో ఎక్కే క్రమంలో ప్రమాదాలు
- షెల్టర్లు నిర్మించాలంటున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



వనస్థలిపురం సుష్మా చౌరస్తా దగ్గరరోడ్డుపైనే ఆపిన బస్సు



ఎండలో ప్రయాణికుల పడిగాపులు

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని విజయవాడ, నాగర్జునసాగర్, కర్నూలు జాతీయ రహదారులపై బస్‌షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు ఎండలో పడిగాపులు కాయాల్సిందే. విజయవాడ జాతీయ రహదారిపై చింతల్‌కుంట, పనామా చౌరస్తా, సుష్మాచౌరస్తా, ఆటోనగర్, నాగర్జున సాగర్ రహదారిపై హస్తినాపురం చౌరస్తా, ఓంకార్‌నగర్, కర్నూలు జాతీయ రహదారిపై టీకేఆర్‌కమాన్ దగ్గర ఇరువైపులా ఉన్న ప్రధాన రహదారులపై ఎక్కడా బస్ షెల్టర్లు లేవు. విజయవాడ జాతీయ రహదారిపై నగరం నుంచి నల్లగొండ, చౌటుప్పల్, చిట్యాల అబ్దుల్లాపూర్‌మెట్ తదితర ప్రాంతాలకు నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. నాగార్జునసాగర్ జాతీయ రహదారిపై హస్తినాపురం చౌరస్తా నుంచి ప్రతినిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు తుర్కయంజాల్, ఇబ్రహీంపట్నం, మాల్, మల్లేపల్లి, దేవరకొండ, డిండి తదితర ప్రాంతాలకు వెళ్తుంటారు. అయితే ఆయా ప్రాంతాల్లో బస్ షెల్టర్లు లేకపోవడంతో వేసవిలో ఎండలో, వర్షాకాలంలో వానలో తడతస్తూ బస్సుల కోసం ఎదురు చేడాల్సిన దుస్థితి నెలకొంటుందని ప్రయాణికులు వాపోతున్నారు.

ఆర్టీసీ అధికారులు స్పందించాలి..

ప్రతి నిత్యం ప్రయాణాలు చేసే ప్రజలు బస్సుల కోసం నిలువ నీడ లేకపోవడంతో రోడ్లపైనే గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. నగరం నుంచి వచ్చే బస్సులు పూర్తిగా ప్రయాణికులతో నిండిపోవడంతో బస్సులకోసం గంటల తరబడి రోడ్లమీదనే ఎండలో నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంటుంది. పలు గ్రామాల నుంచి నగరానికి వచ్చిపోయే ప్రయాణికులు ఎండలకు ఎండుతూ వానలకు తడుస్తూ రోడ్లపై నిలబడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి విజయవాడ, నాగార్జునసాగర్ జాతీయ రహదారులపై బస్ షెల్టర్‌లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, ఆయా ప్రాంతాలవాసులు కోరుతున్నారు.

రోడ్లపైనే ఆపుతున్న బస్సులు

విజయవాడ, నాగర్జునసాగర్ జాతీయ రహదారులపై బస్టాండ్‌లలో షెల్టర్లు లేకపోవడంతో బస్సులు రోడ్డుపైనే ఆపుతుండడంతో ట్రాఫిక్‌జామ్ సమస్యలు తలెత్తుతుంది. అప్పుడప్పుడు అర కిలోమీటర్ వరకు ట్రాఫిక్ స్తంభించిపోతుందని దీంతో పాటు బస్సులు రోడ్డుపైనే ఆపినప్పుడు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వనస్థలిపురం, సుష్మాచౌరస్తా, పనామా చౌరస్తా, హస్తినాపురం చౌరస్తాలలో బస్సులు నడి రోడ్డుపై ఆపాల్సిన దుస్థితి నెలకొంది. రోడ్లపైనే బస్సులు ఆపడంతో బస్సు వెళ్లే వరకు వెనకాల వచ్చిన వాహనాలు ఐదు నుంచి పది నిమిషాల వరకు ఆగుతుండటంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ క్రమంలో వాహనదారుల నడుమ స్వల్ప వాగ్వాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి.

పార్కు నిర్వహణ దివ్యాంగులకే ఇవ్వాలి



మాట్లాడుతున్న దివ్యాంగ సంఘాల నాయకులు

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని జాతీయ వికలాంగుల పార్కు నిర్వహణ దివ్యాంగులకు ఇవ్వాలని రాష్ట్ర ఇందిరా దివ్యాంగుల సేవా సంఘం అధ్యక్షుడు బి.రామచంద్రయ్య అన్నారు. మలక్‌పేటలోని జాతీయ వికలాంగుల పార్కులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత పది సంవత్సరాల నుంచి అమ్‌షా అనే సంస్థకు నిర్వహణ బాధ్యతలు ఇస్తున్నారని, టెండర్లు వేయకుండా రెన్యువల్స్ ద్వారా నిర్వహణ ఇస్తున్నారని, టెండర్స్ వేయకుండా రెన్యువల్స్ ఇవ్వటం ఏంటని ప్రశ్నించారు. నిర్వహణ చేస్తున్న సంస్థ ఎలాంటి సౌకర్యాలు కల్పించటం లేదని సంవత్సరానికి లక్షల రూపాయలు కాంట్రాక్ట్ ఇస్తున్నప్పటికీ వికలాంగులకు ఉపయోగం లేకుండా పోతుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి టెండర్స్ వేసి వికలాంగులకు అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర అంధుల సంఘం కార్యాచరణ సమితి అధ్యక్షుడు పీవీ రావు, నర్సింగ్‌రావు, నరేష్ పాల్గొన్నారు.

తప్పు కప్పి పుచ్చుకునేందుకు తిప్పలు!

- వేయని రోడ్డుకు బిల్లులు తీసుకుని రాత్రికి రాత్రే రోడ్డు వేసే యత్నం
- అడ్డుకున్న స్థానికులు, నాయకులు



శనివారం రాత్రి రోడ్డు వేసేందుకు జేసీబీతో వచ్చిన అధికారులు

సైదాబాద్: సింగరేణి కాలనీలో రోడ్డు వేయకుండానే వేసినట్లు రికార్డుల్లో చూపి బిల్లులు కాజేసి అధికారులు ఆ తప్పును కప్పి పుచ్చుకునేందుకు మరో తప్పుకు పూనుకున్నారు. శనివారం రాత్రి జేసీబీ, సిబ్బందితో వచ్చి రోడ్డు వేసే యత్నాలు మొదలు పెట్టారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న జీహెచ్‌ఎంసీ ఏఈకి సమాచారం ఇవ్వకుండా స్థానిక కార్పొరేటర్ అందుబాటులో లేకపోవడాన్ని అవకాశంగా తీసుకొని తమ తప్పును కప్పి పుచ్చుకునేందుకు శతవిధాల ప్రయత్నించారు. అయితే తమ ప్రాంతంలో రహదారి వేయకుండానే అధికారులు, కాంట్రాక్టర్ బిల్లులు తమ జేబుల్లో నింపుకున్నారని పత్రికల ద్వారా తెలుసుకొని ఉన్న స్థానికులు వారి తప్పుడు యత్నాన్ని ప్రారంభంలోనే అడ్డుకున్నారు. వారికి బీజేపీ నాయకులు కూడా తోడవటంతో హడావుడిగా రహదారి వేయటానికి వచ్చిన అప్పటి ఏఈ సిబ్బందితో అక్కడి నుంచి జారుకున్నాడు. ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీ వాంబే గృహ సముదాయాల వద్ద గత గణేష్ నిమజ్జన ఉత్సవ సమయంలో మంజూరైన సీసీ రహదారిని వేయకుండానే కాంట్రాక్టర్, అధికారులు రికార్డులు తారుమారు చేసి అక్కడ రోడ్డు వేసినట్లు రికార్డుల్లో చూపి రూ. 9.90 లక్షలు తమ జేబుల్లో వేసుకున్నారు. ఈ విషయంపై ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయం శనివారం పత్రికల్లో ప్రచురితమైంది. తమ ప్రాంతంలో అభివృద్ధి పనులు చేయకుండా అధికారులు అవినీతికి పాల్పడటం స్థానికులను ఆగ్రహానికి గురి చేసింది.

స్థానికులకు ఇబ్బందులు లేకుండా పనులు పూర్తిచేయాలి



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న హేమంత్ కేశవ్ పాటిల్

నాగోలు: కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు. నాగోలు డివిజన్ పరిధి బండ్లగూడ శ్రావణీశ్రీ ఎన్‌క్లేవ్, గోల్డెన్ విల్లాస్ దగ్గర జరుగుతున్న బాక్స్ లైన్ పనులను శనివారం ఆయన నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బండ్లగూడ నుంచి శ్రావణి శ్రీ ఎన్‌క్లేవ్ వరకు స్ట్రామ్ వాటర్ పైప్‌లైన్ వేసి నెలలు గడుస్తున్న దానిపై సీసీ రోడ్లు వేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. గోల్డెన్ విల్లాస్ దగ్గర డీఆర్‌ఎఫ్ నుంచి సీఎన్‌డీ ప్లాంట్ వరకు వేస్తున్న బాక్స్ లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. వర్షాలు ప్రారంభం కాకముందే పనులు పూర్తయ్యేలా చొరవ చూపాలన్నారు. అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్లకు నిధులు మంజూరు చేయాలని జోనల్ కమిషనర్‌ను కార్పొరేటర్ కోరారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, డీఈ కనకయ్య, డీఈ నీలిమ, ఏఈ దీపక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, నాయకులు ఈటల భద్రయ్య, మెట్టు రవీందర్‌గౌడ్, పాల్వాయి సంజీవరెడ్డి, లక్ష్మణ్, పంగ శ్యామ్ కుమార్ పాల్గొన్నారు.

సాయినగర్ గుడిసెవాసులకు 'ఇందిరమ్మ ఇళ్లు'కేటాయించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: నాగోలు డివిజన్ పరిధి సాయినగర్ కాలనీలో గుడిసెలు కాలిపోయిన నేపథ్యంలో అక్కడ పట్టాలు ఉన్న 650 మందికి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపిక చేసి ఇళ్లు నిర్మించుకోవడానికి అవకాశం కల్పించాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ పోట్రూను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాగోలు సాయినగర్‌లో గుడిసెలు వేసుకుని ఉండే ప్రాంతంలో పక్కా ఇళ్లు నిర్మించుకుంటే భవిష్యత్‌లో అగ్ని ప్రమాదాలు ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా ఉంటుందన్నారు. ప్రస్తుతం అక్కడ కొందరికి 30–40 గజాలు ఉన్న నేపథ్యంలో తక్కువ స్థలం ఉన్న వారికి జీ ప్లస్ వన్ నిర్మాణానికి అవకాశం కల్పించాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించి హౌసింగ్ బోర్డు ఎండీతో మాట్లాడి పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఐ. రాష్ట్ర సమితి సభ్యులు కె.చందు, ఫైమిద, నాయకులు పాషా, సాహెద బేగం, యాదయ్య, శ్రీనివాస్, రాములు పాల్గొన్నారు.

వరద ముంపునకు గురికాకుండా ముందస్తు చర్యలు

మన్సూరాబాద్: కాలనీలు వరద ముంపునకు గురి కాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ పరిధి గణేష్‌నగర్‌కాలనీలో శనివారం కార్పొరేటర్ పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా చిన్నపాటి వర్షం పడిన గణేష్‌నగర్‌కాలనీలో ముంపునకు గురైయ్యేదని, మల్లికార్జుననగర్‌కాలనీ వరద కాలువలోకి గణేష్‌నగర్‌కాలనీ వరద నీటిని కలపడం జరిగిందని, దీంతో వరదముంపు సమస్య తీరిందన్నారు. కార్పొరేటర్ వెంట దేవేందర్, సిద్ధిరాజు, నాగేష్, మదన్మోహన్, సుధాకర్, రఘుపతి, సతీష్‌చంద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

నాగోలు: ఇంటి నుండి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గౌరెల్లి గ్రామానికి చెందిన గుండు నరేష్ (35)తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 17న టీవీఎస్ ద్విచక్ర వాహనంపై ఎవరికి సమాచారం ఇవ్వకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేశారు.

నేడు మనం సైతం..దేశం కోసం

మన్సూరాబాద్: సిటిజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు దిల్‌సుఖ్‌నగర్ బస్టాప్ నుంచి అష్టలక్ష్మి ఆర్జి వరకు మనం సైతం.. దేశం కోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశభక్తితో కూడిన ప్లేకార్డులతో తిరంగా ర్యాలీ ఉంటుందని యువత భారీ సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, బండారి భాస్కర్, గుండె కిరణ్‌కుమార్, సురేష్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్‌పై దాడి

హయత్‌నగర్: ట్రాన్స్‌జెండర్‌పై ఓ యువకుడు దాడి చేసిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం కుంట్లూర్‌లో నివసించే సంపత్ నిఖిత అనే ట్రాన్స్‌జెండర్ మన్సూరాబాద్‌కు చెందిన శ్రీను అనే యువకుడితో గత నాలుగేళ్లుగా సహజీవనం చేస్తోంది. అతడి ప్రవర్తనతో నచ్చక నిఖిత 10 నెలలుగా అతడి నుంచి విడిపోయి వేరుగా ఉంటుంది. శుక్రవారం అర్ధరాత్రి నిఖిత ఇంటికి వచ్చిన శ్రీను ఆమెతో వాగ్వాదానికి దిగాడు. మాటామాటా పెరిగి ఆమెపై కుర్చీతో దాడి చేశాడు. రాయితో కిటికీ అద్దం పగులగొట్టి స్కూటీకి నిప్పుపెట్టి పారిపోయాడు.బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అవయవదానం



అజ్మీరా రాజశేఖర్ (ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు ఓ విద్యార్థి. జీవన్‌ధాన్ ప్రతినిధుల వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా చెన్నకిష్టాపూర్ మండలం వేమ్నూర్‌కు చెందిన అజ్మీరా రాజశేఖర్ (21) డీగ్రీ విద్యార్థి. ఈ నెల 21న ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. కుటుంబ సభ్యులు ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్‌కు ఎమర్జెన్సీలో ఉంచి చికిత్సను అందించారు. చికిత్సకు రాజశేఖర్ స్పందించకపోవడంతో ఈ నెల 23న బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న జీవన్‌ధాన్ ప్రతినిధులు మృతుడి తల్లిదండ్రులు మంగ్యా, విజయకు అవయవదానంపై అవగాహన కల్పించి రాజశేఖర్ లివర్, రెండు, కిడ్నీలు, రెండు కార్నియాలను దానం చేశారు.

20 కేసులు పరిష్కారం

చంచల్‌గూడ: చంచల్‌గూడ పురుషుల జైల్లో శనివారం నిర్వహించిన జైల్ అదాలత్‌లో 20 కేసులు పరిష్కారమైనట్లు సూపరింటెండెంట్ నవాబు శివకుమార్‌గౌడ్ తెలిపారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో జైల్ అదాలత్ జరిగింది. హైదరాబాద్ నాంపల్లి కోర్టు జడ్జిలు అజేష్‌కుమార్, స్వర్ణలత, కె. ప్రతాప్ కేసులను పరిష్కరించారు.

అవయవదానంపై అవగాహన అవసరం



పోస్టర్లను విడుదల చేస్తున్న సీతా మహాలక్ష్మి

దిల్‌సుఖ్‌నగర్: ఎస్‌ఆర్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు, చిత్రాలేఅవుట్ వాకర్ క్లబ్ ఆధ్వర్యంలో తెలంగాణ శరీర అవయవదాతల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లలను శనివారం అఖిల భారత శరీర అవయాదాతల సంఘం అధ్యక్షులు డాక్టర్ సీతా మహాలక్ష్మీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీతా మహాలక్ష్మీ మాట్లాడుతూ.. అన్ని దానాల కాన్న అవయవదానం గొప్పదన్నారు. అవయదానం పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ట్రస్ట చైర్మన్ రామచంద్రారావు మాట్లాడుతూ.. మనం సమాజం నుండ ఎంతో కొంత పొందుతున్నామని తిరిగి సమాజానికి ఏం ఇస్తున్నామని ప్రశ్నించుకుంటే చాలా మందికి సమాధానం దొరకదన్నారు. మనం చనిపోయిన తర్వాత మన శరీరాన్ని దానం చేస్తే పది మందికి మేలు జరుతుందన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ సభ్యులు అప్పారావు జన్మదినం సందర్భంగా సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇంద్రాసేనారెడ్డి, రావుల నర్సింహారెడ్డి, పి. అంజయ్య, రజని, శ్రీనివాస్‌రావు, గంగాధర్‌రెడ్డి, రాఘవరెడ్డి, జనార్ధన్, అంజల్‌రావు, అంబరీష్, సత్యనారాయణ, గోవర్ధన్, బాల్‌రెడ్డి, సబితారెడ్డి, స్వర్ణలత, శైలజ, వెద సంహిత పాల్గొన్నారు.

వరదనీటి నిల్వలపై ప్రత్యేక దృష్టి



వరదనీటి నిల్వల ప్రాంతాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్

చాదర్‌ఘాట్: వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో వరదనీటి నిల్వల పాయింట్లు గుర్తించి తక్షణమే మరమ్మతులు చేయాలని ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ ఎంఐఎం కార్పొరేటర్ షఫీయుద్దీన్ సూచించారు. శనివారం జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి వరద నిల్వల పాయింట్లను పరిశీలించి మాట్లాడారు. డివిజన్ ముంపు ప్రాంతంలో ఉందని నీరు నిలిచి గుంతలు ఏర్పడి స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.వరద నిల్వల పాయింట్ల మరమ్మతుల కోసం రూ. 25 లక్షల ఎమ్మెల్యే నిధులు కేటాయించారన్నారు. నియోజకవర్గంలోనే ఓల్డ్‌మలక్‌పేట అభివృద్ధిలో ముందుందన్నారు.

భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభం



ఎల్‌బీనగర్: తరుచూ పొంగుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ల స్థానంలో కొత్త లైన్ ఏర్పాటు చేస్తే సమస్య తీరుతుందని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్–2లో నూతనంగా నిర్మించే పైప్‌లైన్ల పనులను ఆయన శనివారం కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రతి కాలనీలో డ్రైనేజీ సమస్య ఉందని ఈ సమస్యను తీర్చేందుకు పాత పైప్‌లైన్లను తొలగించి నూతన లైన్లు వేస్తున్నామన్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రదీప్‌రెడ్డి, ధన్‌రాజ్, సురేష్‌కుమార్, జయసింహ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దాం



ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు.శనివారం నిర్వహించిన ఎల్‌బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ బలోపేతం చేసేందుకు త్వరలోనే డివిజన్ పార్టీ అధ్యక్షులతో పాటు బ్లాక్ అధ్యక్షులు, బూత్ అధ్యక్షులను నియమించనున్నట్లు తెలిపారు.రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు బూత్ స్థాయి అధ్యక్షులకు పార్టీ పరంగా ప్రాధాన్యం ఉంటుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ విధానాలకు ప్రజల్లోకి తీసుకువెళ్లేలా కృషి చేయాలన్నారు. కష్ట పడేవారికి పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శివసేనారెడ్డి, ధారాసింగ్, ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్, కార్పొరేటర్లు దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, నాయుకులు మిద్దెల జితేందర్, ఉప్పలి శ్రీనివాస్‌గుప్తా, భాస్కర్‌యాదవ్, వజీర్‌ప్రకాశ్‌గౌడ్, లక్ష్మీప్రసన్న, చలకాని వెంకటేష్‌యాదవ్, సుజాత రెడ్డి, కిషోర్‌గౌడ్, శ్రీపాల్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, నర్సింహ్మ యాదవ్, మంజులారెడ్డి పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లు గుర్తింపు కార్డులు తీసుకోవాలి

డైరెక్టర్ బి.శైలజ

చాదర్‌ఘాట్: రాష్ట్రంలోని ట్రాన్స్‌జెండర్స్ గుర్తింపు కార్డులు తీసుకోవాలని రాష్ట్ర వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ శాఖ డైరెక్టర్ బి.శైలజ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నేషనల పోర్టల్ ద్వారా సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చి జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకుంటే 30 రోజుల్లో గుర్తింపు కార్డులు ఇస్తారన్నారు. ఈ కార్డుల ద్వారా ప్రభుత్వం ప్రవేశ పెట్టే సంక్షేమ పథకాలకు అర్హులవుతారని తెలిపారు. రాష్ట్రంలో 2326 మంది గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారని, అందులో 1569 మందికి కార్డులు ఇచ్చామన్నారు. మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ట్రాన్స్‌జెండర్స్ అధిక సంఖ్యలో ఉన్నారని తెలిపారు. గత మూడు నెలల క్రితం 42 మంది ట్రాన్స్‌జెండర్స్‌కు హోంగార్డు ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. ట్రాన్స్‌జెండర్స్ బెగ్గింగ్ విధానం మానుకొని సమాజంలో గౌరవంగా బతకాలని సూచించారు. త్వరలో అన్ని జిల్లాలో అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు.

అక్బర్‌బాగ్‌లో ఎమ్మెల్యే బలాల పర్యటన

మలక్‌పేట: మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల శనివారం అక్బర్‌బాగ్‌లో పర్యటించారు. డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు పర్యవేక్షించారు. గవర్నమెంట్ ప్రెస్ రోడ్డులో బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండగా ధ్వంసమైన తాగునీటి పైపులైన్‌ను పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణం, పైపులైన్ మరమ్మతులపై అధికారులతో చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట డీజీఎం హస్మత్ అలీ, ప్రాజెక్టు అధికారులు ఉన్నారు.

ఎస్సైగా పదోన్నతి

మలక్‌పేట: మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న మురావత్ తేజ్‌నాయక్ ఎస్సైగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ తేజ్‌నాయక్‌కు స్టార్ ధరింపజేసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెపారు. 1990 బ్యాచ్‌కు చెందిన తేజ్‌నాయక్ నల్లకుంట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా మొదటిసారి విధుల్లో చేరారు. అంబర్‌పేట, మీర్‌చౌక్, నాంపల్లి, స్పెషల్ బ్రాంచ్, ఫిల్మ్‌నగర్ పీఎస్‌లలో పని చేశారు. 2018లో ఏఎస్సైగా ఆయన పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఎస్సైలు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

రహదారుల సుందరీకరణకు ప్రాధాన్యం

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లోని ప్రధాన అంతర్గత రహదారులు అన్నింటినీ సుందరీకరించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. ఎక్సైజ్ కాలనీలో నిర్మించనున్న నూతన సీసీ రహదారి నిర్మాణ పనులను శనివారం ఆమె జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఐఎస్‌సదన్‌లోని పలు ప్రాంతాల్లో తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయని ఆయా ప్రాంతాల్లో పైప్‌లైన్ పనులు పూర్తయిన తర్వాత సీసీ రోడ్డు పనులు చేపడుతామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం ఏఈ శిరీష, ప్రశాంత్, విశాల్, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అందాల పోటీలతో రాష్ట్రం పరువు తీశారు

నాగోలు: అందాల పోటీల పేరుతో రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి సర్కార్ ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ పరువు తీశారని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీష్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మిస్ వరల్డ్ పోటీల పేరుతో రేవంత్‌రెడ్డి సర్కార్ చేసిన హడావుడి మొత్తం ఇప్పుడు మరో మలుపు తిరిగిందని, హైదరాబాద్‌లో జరుగుతున్న మిస్ వరల్డ్ పోటీలపై మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ సంచలన వ్యాఖ్యలు చేశారన్నారు. మధ్య వయసు ఉన్న పురుషులను ఆనందపెట్టాలని తమపై ఒత్తిడి తీసుకువచ్చారని తమను వేశ్యలా చూశారంటూ ఆమె అసహనం వ్యక్తం చేస్తూ పోటీల నుంచి మధ్యలోనే తప్పుకుని స్వదేశానికి వెళ్లిపోయారన్నారు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మిస్ వరల్డ్ పోటీల్లో ఇలాంటి ఘటనలు జరగడం.. అది కూడా మన రాష్ట్రంలో జరిగినప్పుడే తెరపైకి రావడం ప్రభుత్వం, నిర్వాహకుల తీరుపై అనేక అనుమానాలకు దారి తీస్తుందన్నారు. ప్రపంచ దేశాల నుంచి పోటీల కోసం వచ్చిన యువతులతో అసభ్యంగా ప్రవర్తించిన వారు వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేకు వినతి

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధి గుంటి జంగయ్యనగర్ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం కాలనీవాసులు కన్న ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్‌తో కలిసి కాలనీ సమస్యలపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కాలనీలోని శ్రీ విజయ దుర్గాంబిక దేవాలయం ముందు గత కొన్ని నెలలుగా డ్రైనేజీ పొంగిపొర్లుతోందని, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు.